# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-08-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు విద్యుత్ అందించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

2. తెలంగాణలో పేదల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు

3. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ నుంచి వారణాసికి కొత్త విమాన సర్వీస్‌ను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు.

4. ఆంధ్రప్రదేశ్ వెలిగొండ ప్రాజెక్ట్ మొదటి దశ పనులను పూర్తి చేసి ఆగస్టు చివరి వారంలో నల్లమల సాగర్‌కు నీటిని విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

==========================

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు తక్కువ ధరకు విద్యుత్ అందించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో విద్యుత్ శాఖపై నిన్న నిర్వహించిన సమీక్షలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సౌర విద్యుత్‌పై మరింత దృష్టి సారించాలని, సెప్టెంబరు నాటికి ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఆరు లక్షల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

--------------------------

తెలంగాణలో పేదల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు సొంత ఇళ్ళు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లను నిర్మించాలని నిర్ణయించామని, ఏడాదిలోపు వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయల ఉచిత ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి వారణాసికి కొత్త విమాన సర్వీస్ ప్రారంభమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ సర్వీసును ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పాల్గొని మాట్లాడుతూ వారణాసికి వెళ్లే భక్తులకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

-----------------------------

సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో రొద్దం మండల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆమె నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధాన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని అన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలు, బలిదానాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను స్మరించుకుంటూ యువత, విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచిస్తూ,

వాయిస్..30..సెకన్లు

-----------------------------

అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. నంద్యాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవయవదానంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తుల నుంచి సేకరించిన అవయవాలతో దాదాపు ఎనిమిది మంది జీవితాలను కాపాడవచ్చని తెలిపారు. అవయవదానం చేసేందుకు మరింత మంది ముందుకు రావాలని కోరారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వెలిగొండ ప్రాజెక్ట్ మొదటి దశ పనులను పూర్తి చేసి ఆగస్టు చివరి వారంలో నల్లమల సాగర్‌కు నీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మార్కాపురంలో వెలిగొండ ప్రాజెక్ట్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..30..సెకన్లు

-----------------------------

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిపై రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నుంచి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతు గుర్తింపు కార్డులు, ఎరువుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాన్ని కేంద్రమంత్రి ప్రశంసించారు. ఈ విధానం రైతులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో పండించే పప్పు దినుసులను 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు.

---------------------------

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

దేశ విభజన సమయంలో జరిగిన విషాద సంఘటనలు, ప్రజలు ఎదుర్కొన్న బాధలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది ఆగస్టు 14వ తేదీని విభజన విషాద స్మృతి దినంగా నిర్వహిస్తున్నారు. 1947లో విభజన కారణంగా జరిగిన హింస వల్ల లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సంఘర్షణ, చేసిన త్యాగాలను స్మరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం 2021 సంవత్సరం నుండి విభజన విషాద స్మృతి దినాన్ని ఈరోజున నిర్వహిస్తోంది. ప్రజల మధ్య సామాజిక ఐక్యతను, శాంతిని, సద్భావాన్ని పెంపొందించడం ఈరోజు నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఊబకాయం నియంత్రణకు జాయింట్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో సీఐఐ ఆధ్వర్యంలో ఊబకాయంపై నిర్వహించిన సదస్సులో మంత్రి నిన్న మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, అనారోగ్యకర ఆహారం, చక్కెర పానీయాలు ఊబకాయానికి ప్రధాన కారణాలని చెప్పారు. ఊబకాయం నియంత్రణకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే పిల్లల్లోనూ ఊబకాయాన్ని ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటామన్నారు.

---------------------------

విశాఖపట్నంలో పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం –ఆర్‌డీఎస్‌ఎస్ పనులను కేంద్ర విద్యుత్ శాఖ అధికారులు నిన్న పరిశీలించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శశాంక్ మిశ్రా, డైరెక్టర్ ప్రణవ్ తాయల్ విశాఖ సాగర్‌నగర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌ను సందర్శించారు. ఈపీడీసీఎల్ పరిధిలో చేపడుతున్న భూగర్భ విద్యుత్ కేబులింగ్, స్మార్ట్ మీటరింగ్, ఐటీ ఆధారిత విద్యుత్ సేవలు, ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం స్కాడా నియంత్రణ కేంద్రాన్ని సందర్శించి విద్యుత్ పంపిణీ వ్యవస్థ, సాంకేతిక సేవల నిర్వహణను పరిశీలించిన అధికారులు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని సూచించారు.

=====================